# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

ఆదివారం | 16 మార్చి 2025 | పేజీలు 8


## రాయలసీమ ప్రాజెక్టుకు కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించింది

- ఇది కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయమన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఈ అంశంపై కేంద్రాన్ని పలుమార్లు కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడి
- తెలంగాణలో కీలక సమయంలో అధికారంలోకి వచ్చామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ నిర్మించ తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులను నిరాకరించిందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయమని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాలతో ఆంధ్రప్రదేశ్ రాయలసీమ ఎత్తిపోతలను నిర్మించాలని భావించిందని ఆయన అన్నారు. అయితే, అంతర్ రాష్ట్ర నిబంధనలను ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టిందంటూ పలుమార్లు కేంద్రానికి ఫిర్యాదులు చేశామని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్రానికి లేఖ రాశారని గుర్తు చేశారు. కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఈ ప్రాజెక్టు నిర్మించాలన్నది ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని అన్నారు. పర్యావరణ చట్టాలకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించారని పేర్కొన్నారు. తెలంగాణలో కీలక సమయంలో

-2 లో

## మరోసారి నేనే ముఖ్యమంత్రి అవుతాను

- మొదటిసారి బీఆర్ఎస్ మీద వ్యతిరేకతతో ఓటు వేశారన్న రేవంత్ రెడ్డి
- రెండోసారి మా మీద నమ్మకంతో ఓటు వేస్తారన్న ముఖ్యమంత్రి
- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల వద్దకు వెళతామని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** తాను మరోసారి ముఖ్యమంత్రిని అవుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శాసనమండలి వాయిదాపడిన అనంతరం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. తెలంగాణ ప్రజలు మొదటిసారి బీఆర్ఎస్ మీద వ్యతిరేకతతో ఓటు వేశారని, రెండోసారి మా మీద నమ్మకంతో ఓటేస్తారని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల నమ్మకాలను నిలబెట్టుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల వద్దకు వెళతామని ఆయన అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులే మా ఓటర్లు అని ఆయన వెల్లడించారు. పనిని నమ్ముకొని తాము ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తమకు స్టేచర్ కంటే స్టేట్ ఫ్యూచర్ ముఖ్యమని స్పష్టం చేశారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని పునరుద్ఘాటించారు. హామీ ఇచ్చినట్లుగా కోటి మంది మహిళలకు లబ్ధి చేకూరుస్తామని, వారు ఇప్పుడు మాట్లాడకపోయినా

ఓటు కాంగ్రెస్ పార్టీకే వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగుల బకాయిలను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచడమే తమ విధానమని అన్నారు.

-2లో

## రుణమాఫీపై తప్పుడు ప్రచారం.. లెక్కలతో అన్ని వివరాలు బయటపెడ్తం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన కేవలం 3 నెలల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దీనిపై కావాలనే ప్రతిపక్ష

-మిగతా 2లో



## బీజేపీ ఎమ్మెల్యేలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమావేశం

- ఎమ్మెల్యేలకు కిషన్ రెడ్డి దిశానిర్దేశం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచన
- ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా సభలో మాట్లాడాలని సూచన

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యేలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సమావేశమైన కేంద్ర మంత్రి, శాసనసభలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో, ఏడాదిన్నర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా సభలో మాట్లాడాలని సూచించారు. సభలో మాట్లాడేటప్పుడు భాష విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మాట్లాడాలనుకునే అంశాన్ని ముందుగానే నిర్ణయించుకోవాలని అన్నారు. ఎవరు ఏ అంశంపై మాట్లాడాలో ప్లాన్ చేసుకొని, అసెంబ్లీలో మాట్లాడే విధంగా సిద్ధం కావాలని సూచించారు.

## కుటుంబాన్ని, పిల్లల్ని తిట్టారని రేవంత్ రెడ్డి బాధపడుతున్నారు... కానీ...!

- భారతదేశంలో కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతామన్న కవిత
- రేవంత్ రెడ్డి చేసిందే ఆయనకు తిరిగి వచ్చిందని వ్యాఖ్య
- కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తనను, తన కుటుంబాన్ని, తన పిల్లలను తిట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బాధపడ్డారని, కానీ గత ఐదారేళ్లుగా వారు చేసిన పనే ఈరోజు ఆయన మీదకు తిరిగి వెళ్లిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. భారతదేశంలో కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతామని, మనం చేసింది మనకు తిరిగి వస్తుందని భావిస్తుంటామని పేర్కొన్నారు. అందుకే రేవంత్ రెడ్డి చేసింది ఆయనకు వాపస్ (తిరిగి) వచ్చిందని పేర్కొన్నారు. ఆయన మొదలుపెట్టిన విష సంస్కృతి తిరిగి ఆయన మెడకే చుట్టుకుందని ఆమె అన్నారు. తద్వారా, మనం ఏది చేస్తామో



## రుణమాఫీపై తప్పుడు ప్రచారం..

## లెక్కలతో అన్ని వివరాలు బయటపెడ్తం

- మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఫైర్?అయ్యారు. తాము అమలు చేస్తున్న ప్రతి పథకానికి సంబంధించి లెక్కలతో సహా చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

ఇవాళ (మార్చి 15) అసెంబ్లీ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా భట్టి మట్లాడుతూ ?ప్రతీ గ్రామాల్లో జాబితా పెడతాం. గృహ జ్యోతి 115 నియోజక వర్గాల సమాచారం మా దగ్గర ఉంది. మేము చేసేది ప్రజల కోసమే. మీలాంటి రాజకీయ పార్టీలకు కాదు. ముఖ్యంగా గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటలకు బీఆర్ఎస్ కంటే ఎక్కువ మేలు చేశాం. గృహజ్యోతి పథకం కింద రూ.కోట్లు చెల్లిస్తున్నం' అని తెలిపారు.

**పల్లా వాస్తవాలు చెప్పు**

బీఆర్ఎస్?ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్?రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. విద్యాశాఖపై సమీక్షించడానికి ముఖ్యమంత్రికి సమయంలేదని అనడం సరికాదన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఓయూకి తొలిసారి దళిత వీసీని నియమించినట్లు వివరించారు. 'పల్లా విద్యాసంస్థలు నడుపుతారు. లెఫ్ట్ నుంచి వచ్చారు. వాస్తవాలు చెప్తారని అనుకున్నం. కానీ ఇంత బ్లైండ్ గా మాట్లాడతారేంటి? అని మండిపడ్డారు.

## రాయలసీమ ప్రాజెక్టుకు కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించింది

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో వాటాను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుందని చెప్పారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రితో వ్యక్తిగతంగా మాట్లాడి సమగ్రంగా వివరించినట్లు చెప్పారు. ఫిబ్రవరి 27న జరిగిన 25వ సమావేశంలో ఎన్జీటీ ఉత్తర్వులను సమీక్షించి నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారించిందని తెలిపారు. కృష్ణా జలాశయాల్లో తెలంగాణ హక్కు కోల్పోకుండా చూడటంతో పాటు విధానపరమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## కుటుంబాన్ని, పిల్లల్ని తిట్టారని రేవంత్ రెడ్డి బాధపడుతున్నారు... కానీ...!

- మొదటి పేజి తరువాయి

అదే తిరిగి వస్తుందని ముఖ్యమంత్రి విషయం ద్వారా మనకు రుజువైందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యులం హుందాగా ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అందుకే, కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, ఆ తర్వాత మాట్లాడదామని చెప్పామని వెల్లడించారు.కానీ అందుకు ముఖ్యమంత్రి అంగీకరించలేదని ఆయన తెలిపారు. ఇద్దరు జర్నలిస్టులను అరెస్టు చేశారని, కానీ రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఎలా ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. 'ఎవరైనా సరే నేను బట్టలూడదీసి బజారులో ఊరేగిస్తా'నని రేవంత్ రెడ్డి మాట్లాడిన ఈ రోజు చరిత్రలో బ్లాక్ డే అని ఆమె అన్నారు. తన కుటుంబాన్ని తిడుతున్నారని చెబుతూనే, ఆయన ప్రయోగిస్తున్న భాష సరిగ్గా లేదని అన్నారు. యథా రాజా తథా ప్రజ కాబట్టి మీరు మాటలు మాట్లాడటం ఆపివేయాలని సూచించారు.శాసనమండలిలో గవర్నర్ ప్రసంగ తీర్మానానికి ధన్యవాదాలు చెప్పడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండలికి వచ్చారని చెప్పారు. ఆ సమయంలో, కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులం ఆయనను డిమాండ్ చేశామని తెలిపారు. కానీ మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారికి కూడా కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ మీద మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి తన హుందాతనాన్ని పెంచుకోవాలని హితవు పలికారు.

# కేసీఆర్ వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ మధ్య స్టేచర్‌పై చేసిన కామెంట్స్ ఎంత సంచలనం కలిగించాయో చూశాం. ఇప్పుడు అదే అంశంపై సభలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తాను చెప్పిన విషయాన్ని తప్పుగా వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ప్రతిపక్షంలో ఉండాలని ఆకాంక్షించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడిన రేవంత్ రెడ్డి చాలా అంశాలపై స్పందించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను ఓడించిన ప్రజలే తప్పు చేశారని బీఆరెస్ నేతలు అంటున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజలను తప్పు పట్టడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలకు వాళ్ల స్టేచర్‌పైన ఉన్న ఆలోచన తెలంగాణ ఫ్యూచర్ పైన లేదా అని నిలదీశారు.ప్రజలు ఇచ్చిన తీర్పుతో బీఆరెస్ మార్చురీలో ఉందని తాను మాట్లాడినట్టు వివరణ ఇచ్చారు. దాన్ని కేసీఆర్‌ను అన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి మాటలు కేసీఆర్‌ను అనేంత కుంచిత బుద్ధి తనకు లేదన్నారు. కేసీఆర్ 100 సంవత్సరాలు ఆరోగ్యంతో బతకాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కేసీఆర్ ప్రతిపక్షంలో అక్కడ అలాగే ఉండాలి.. మేం అధికారపక్షంలో ఇక్కడ ఇలాగే ఉంటామని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ సభలో ఉండి వారి అనుభవంతో సూచనలు ఇస్తే వాటిని తీసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు రేవంత్. నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పుకుంటున్నవాళ్ళు పదేళ్లలో ఎందుకు ఉద్యోగాలను భర్తీ చేయలేదని ప్రశ్నించారు. దేశ చరిత్రలోనే 57,924 ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. వాళ్ల హయాంలో 22.9 శాతం ఉన్న నిరుద్యోగ సమస్యను ? 18.1 శాతానికి తగ్గించిన చరిత్ర తమదని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్ని యూనివర్శిటీ వీసీల నియామకం సామాజిక వర్గాల వారిగా ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేశామన్నారు. వీసీ లిస్టు తీద్దాం.. మేం సామాజిక న్యాయం చేసింది నిజమో కాదో చూద్దామన్నారు. విలాసవంతమైన జీవితాలకు భంగం కలిగించానని వాళ్లకు కోపం ఉండొచ్చన్నారు రేవంత్. కానీ కుల దురహంకారం ప్రదర్శించడం న్యాయమా? అని ప్రశ్నించారు. గవర్నర్, స్పీకర్‌లను గౌరవించరు? ఏకవచనంతో సంబోధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని సమర్థించుకుంటూ ధర్నాలు చేస్తున్నారని ఇదెక్కడి న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లు.. దావత్‌లు ఇచ్చే దోస్తులేనా బీఆరెస్‌కు కావాల్సింది అని నిలదీశారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి బీఆరెస్‌కు పట్టదా అని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సమస్యలపై కేసీఆర్‌తో ఎప్పుడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు రేవంత్ రెడ్డి. తెలంగాణలో మహిళలు ఇంటిబిడ్డగా తనను చూసుకుంటున్నారని అన్నారు. ఆడ బిడ్డలకు స్వేచ్ఛ కల్పించాలని ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. "రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. 5000 స్కూల్స్ ను బీఆరెస్ మూసివేసింది. స్కూల్ యూనిఫాంలు కుట్టే బాధ్యత మహిళా సంఘాకు ఇచ్చాం. 1000 ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చాం. 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే బాధ్యత మహిళా సంఘాలకు ఇచ్చాము." అనితెలిపారు. బతుకమ్మ చీరల పేరుతో దోపిడీ చేశారని వాటిని రద్దు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నామని వెల్లడించారు. కోటి 30 లక్షల చీరలు నేతన్నలకు ఆర్డర్ ఇచ్చామని వివరించారు. ఒక భావోద్వేగంతో తెలంగాణను అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

# కృష్ణాజలాలపై చర్చిద్దామా....

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో చాలా సమస్యలు కేవలం కేసీఆర్ ప్రభుత్వమే కారణమని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు వాళ్లతో కుమ్మకై వాటిని పరిష్కరించకుండా ఇప్పుడు వాటిని ఎత్తిచూపుతున్నారని మండిపడ్డారు. పథకాలు అమలు అవుతున్నా తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసగించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు జరిపారని మండిపడ్డారు. అప్పట్లో ఉన్న మహిళా గవర్నర్ అడుగడుగునా అవమానించారని గుర్తు చేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి తెలంగాణలో లేదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. వాటినే గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించామని వెల్లడించారు. అలాంటివి ప్రస్తావిస్తే కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం ఉందని విమర్శించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యకు అప్పులే కారణమని అందుకే రుణమాఫీ హామీ ఇచ్చామని తెలిపారు. వారిని రుణబాధల నుంచి విముక్తి చేసినట్టు వెల్లడించారు. వారికి ఇవ్వాల్సిన రైతు బంధును మార్చి 31 లోపు అందిర ఖాతాల్లో పడతాయని భరోసా ఇచ్చారు. స్టేచర్ అంటూ మాట్లాడే బీఆర్ఎస్‌ను ప్రజలు మార్చురీకి పంపించారని తాను అంటే ఏదో కేసీఆర్‌ను అన్నట్టు తప్పుడు ప్రచారం చేశారని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పదేళ్లుగా మంత్రులు చేసిన వాళ్లంతా ఫైర్ అయ్యారని అన్నారు. ఇలానే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో గుండు సున్నా ఖాయమని అన్నారు. వరి వేస్తే ఉరే అని ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ మాట్లాడారని గుర్తు చేశారు. కానీ తాము ధాన్యం కొనుగోలు చేసి రూ.1206 కోట్లు సన్న వడ్లకు బోనస్ అందించామని తెలిపారు. కాళేశ్వరం లేకుండానే రైతులు 1 కోటి 56 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారని వివరించారు. రైతు కమిషన్ ఏర్పాటు చేసి రైతుల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. పోరాటాలు చేశామని చెప్పుకునే కేసీఆర్ ఆనాడు చంద్రబాబుకు మోకరిల్లి 299 టీఎంసీలు చాలని సంతకం పెట్టి తెలంగాణకు శాశ్వత మరణ శాసనం రాసింది వాళ్లు కాదా? అని రేవంత్ ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాగానే కేంద్రాన్ని కలిసి నీళ్ల కోసం కొట్లాడామన్నారు. వైస్ ఆశీర్వాదంతో కేంద్రమంత్రి అయిన కెసీఆర్ పోతిరెడ్డిపాడు నీటిని తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకున్నది నిజం కాదా అని నిలదీశారు. తెలంగాణ జిల్లాలను వలస జిల్లాలుగా మార్చి రైతులను పొట్టన పెట్టుకుంది వీళ్లేనని ఆరోపించారు. ఆనాడు వీళ్లు సహకరించకపోతే పోతిరెడ్డి పాడు నుంచి నీళ్లు వెళ్లేవా అని ప్రశ్నించారు.కెసిఆర్ కాంట్రాక్టర్లు ఇచ్చిన కమీషన్ల కోసం కక్కుర్తి పడి జూరాలను రెండు టీఎంసీల నుంచి ఒక టీఎంసీకి తగ్గించి? నీళ్లను శ్రీశైలానికి పంపించడం వల్ల ప్రాజెక్టును పూర్తి చేసినా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి దాపురించిందన్నారు రేవంత్. ఎస్ఎల్బీసీని నాలుగేళ్లల్లో పూర్తి చేయాల్సింది పదేళ్లైనా పూర్తి చేయకుండా నల్లగొండకు అన్యాయం చేసింది నిజం కాదా ప్రశ్నించారు. ఇవాళ జరిగిన ఎస్ఎల్బీసీ ప్రమాదానికి, ఎనిమిది మంది చావుకు కారణం వాళ్లు కాదా మండిపడ్డారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో పదేళ్లలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదని కేసీఆర్‌ను రేవంత్ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సంధానం ఇవ్వాల్సి వస్తుందని ఇవాళ సభ నుంచి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. 15 నెలల్లో సభకు కెసిఆర్ కేవలం రెండుసార్లే వచ్చారన్నారు. ప్రభుత్వ జీతభత్యాలు తీసుకుని ప్రజలను వారి కర్మకు వదిలేసిన నాయకుడు కెసిఆర్ అని మండిపడ్డారు. ఎస్ఎల్బీసీ, డిండి పూర్తి చేసి ఉంటే నల్లగొండ కష్టాలు తీరేది కదా అని ఆవేదన వ్యక్తం చేశారు. కెసీఆర్ ఏ రోజు వస్తే ఆరోజు కృష్ణా జలాలపై చర్చ పెడదామని సవాల్ చేశారు రేవంత్ రెడ్డి. లెక్కలతో సహా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమది తప్పయితే బీఆర్ఎస్ నాయకులకు క్షమాపణ చెప్పడానికి సిద్ధమని వెల్లడించారు. ఈ సవాలుకు కెసీఆర్ సిద్ధమా లేదో చెప్పాలన్నారు. రోజులు 10 టీఎంసీలు తరలించుకుపోయే ప్రాజెక్టులు పక్క రాష్ట్రం నిర్మిస్తుంటే కెసిఆర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని గుర్తు చేశారు. ఒక సామాన్య రైతు గ్రీన్ ట్రైబ్యునల్‌కు వెళితే విధి లేని పరిస్థితుల్లో ఆనాటి ప్రభుత్వం ఇంప్లీడ్ అయిందన్నారు.

# మేం చేసిన అప్పు రూ.లక్షా 58 వేల కోట్లు.. అసెంబ్లీలో అప్పులపై సీఎం రేవంత్ వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అప్పులపై అసెంబ్లీలో సీఎం రేవంత్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేసిన అప్పులు రూ.లక్షా 58 వేల కోట్లని సీఎం స్పష్టతనిచ్చారు. కేసీఆర్ హయాలంలో చేసిన అప్పులపై రూ. లక్షా 53 వేల కోట్లు చెల్లించినట్లుగా తెలిపారు. తాము చేసిన అప్పులు కేసీఆర్ చేసిన తప్పులు సరిదిద్దేందుకేనని ఘాటు సమాధానం ఇచ్చారు సీఎం రేవంత్. రెండు దఫాలు పాలించిన బీఆర్ఎస్ తమకు రూ. 8.19 లక్షల కోట్ల అప్పు ఇచ్చి వెళ్లిందని తెలిపారు సీఎం రేవంత్. ప్రస్తుతం తెలంగాణ అప్పు రూ. 7.38 లక్షల కోట్లు ఉందని చెప్పారు. 2023-25 వరకు చేసిన అప్పు రూ.లక్షా 58 వేల కోట్లని చెప్పిన సీఎం.. కేసీఆర్ చేసిన అప్పు రూ. 88 వేల కోట్లు చెల్లించామని అన్నారు. అందులో మిత్తి రూ. 64 వేల 768 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. తాము అప్పులు చేస్తున్నట్లుగా విమర్శిస్తున్నారని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కట్టడానికే సరిపోతుందని అన్నారు. అప్పు అంటే బ్యాంకుల నుంచి తెచ్చింది మాత్రమే అప్పు కాదు.. గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు కూడా అప్పులేనని ఈ సందర్భంగా అన్నారు. తాము చేసింది చేసినట్లు చెబుతామని.. చేయనిది వివరిస్తామని అన్నారు. ప్రజలే తమ బాస్ లని.. వారికే వివరిస్తామని చెప్పారు సీఎం. అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపదలచుకోలేదని, తాను చెప్పేది అబద్ధమని కేసీఆర్ ను నిరూపించమనండని సవాల్ విసిరారు. ఫాం హౌజ్ లో దాక్కున్నా కేసీఆర్ ను బయటికి తీసుకొచ్చే శక్తి తమకుందని సీఎం రేవంత్ ఫైరయ్యారు.

# కృతజ్ఞత లేకుండా బతకడం వేస్ట్.. బండ్ల గణేష్ కౌంటర్ ఆయనకేనా.. ?



**హైదరాబాద్ పెన్ పవర్:**బండ్ల గణేష్ నిర్మాతగా,నటుడిగా ఎంత ఫేమస్సో.. సినిమా ఫంక్షన్లలో స్పీచ్ లకు, సోషల్ మీడియా మీమ్స్ కి కూడా అంతే ఫేమస్. బండ్ల గణేష్ సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గానే ఉంటారు. రాజకీయ అంశాలు, సామాజిక అంశాలపై తరచూ ఎక్స్ లో స్పందిస్తుంటారు బండ్ల గణేష్. తాజాగా బండ్ల గణేష్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.. కృతజ్ఞత లేకుండా బతకడం మానవత్వాన్ని కోల్పోవడమే అంటూ బండ్ల గణేష్ చేసిన ట్వీట్ జనసేన ఎమ్మెల్సీ నాగబాబును ఉద్దేశించే అంటూ కొంతమంది నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.

కృతజ్ఞత లేకుండా బతకడం మానవత్వాన్ని కోల్పోవడమే అని.. ద్రోహంతో బతకడం మనుష్యత్వాన్ని నాశనం చేసుకోవడమేనని అన్నారు బండ్ల. ఒక మనిషి జీవితంలో కృతజ్ఞత ఎంత ముఖ్యమో, ద్రోహం ఎంత ప్రమాదకరమో స్పష్టంగా తెలియజేస్తుందని... మనం ఎప్పుడూ కృతజ్ఞతతో జీవించాలని అంటూ ట్వీట్ చేశారు బండ్ల గణేష్. శుక్రవారం చిత్రాడలో జరిగిన జనసేన 12వ ఆవిర్భావ సభలో ఎమ్మెల్సీ నాగబాబు వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. పవన్ కళ్యాణ్ విజయానికి తామే కారణమని ఎవరైనా అనుకుంటే అది వారి ఖర్మ అని.. పవన్ విజయానికి కృషి చేసింది ఒకటి పవన్ కళ్యాణ్, రెండ్ పిఠాపురం ఓటర్లు అంటూ నాగబాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. నాగబాబు వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ నేత వర్మ సీటు త్యాగం చేస్తేనే పవన్ కళ్యాణ్ గెలిచారని.. పవన్ విజయం వెనక వర్మ కృషి ఉందని అంటున్నారు టీడీపీ కార్యకర్తలు.

ఎన్నికల ప్రచారంలో తమ నేతను వాడుకొని.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కనీసం కృతజ్ఞత చూపకపోవడం సమంజసం కాదని వర్మ అనుచరులు కామెంట్ చేస్తున్నారు. ఈ క్రమంలో బండ్ల గణేష్ ట్వీట్ కూడా ఎమ్మెల్సీ నాగబాబును ఉద్దేశించే అంటూ కామెంట్ చేస్తున్నారు టీడీపీ శ్రేణులు.

## ఇందిరమ్మను అమ్మ .. తరువాత ఎన్టీఆర్ అన్న అయితే .. ఇప్పుడు నేను రేవంత్ అన్నను..



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో గత బీఆర్ఎస్ పాలన.. బీఆర్ఎస్ నేతల మాటల తీరుపై ఆశక్తికరవ్యాఖ్యలు చేశారు. మొదట ఇందిరమ్మను అమ్మ అని.. తరువాత ఎన్టీఆర్? ను అన్నా అని.. ఇప్పుడు తనను రేవంత్ అన్నా అని ప్రజలు సంబోధిస్తున్నారని అసెంబ్లీలో అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సామాన్యులు ముఖ్యమంత్రిని ఏమని సంబోధించాలో కూడా తెలియని పరిస్థితి ఉండేది. గతంలో బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఎక్కడికైనా వస్తున్నారంటే కనీసం గంట ముందే ఎక్కడికక్కడ బంద్ చేసేవారు. కనీసం ఆయన్ను కలవాలంటే కూడా సాధ్యపడదు. ఆయన్ను దగ్గరగా చూసే అవకాశం కూడా దొరకదు. కానీ.. అప్పుడూ సీఎం అంటే అలా ఉండేదేమో కానీ.. ఇప్పుడు రేవంత్ అన్న వచ్చాడంటూ ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ రోజు ( మార్చి 15) సీఎం రేవంత్? రెడ్డి మాట్లాడుతూ.. ( మార్చి 15) అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నేత.. కేసీఆర్ మోహం చాటేశారని.. గవర్నర్? ప్రసంగాన్ని ధన్యవాద తీర్మానంపై చర్చ పెడితే బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్? చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. బీఆర్ఎస్ హయాంలో తప్పులు.. అప్పులు చేసి ప్రజలను ముంచేశారని సీఎం రేవంత్? తెలిపారు. తెలంగాణలో ఎక్కడ ప్రమాదం జరిగినా వాళ్ల కళ్లలోనే మెరుపు కనిపిస్తోంది. పైశాచికత్వంలో వాళ్లు ఉగాండా అధ్యక్షుడితో పోటీ పడుతున్నారని సీఎం రేవంత్? అన్నారు.

## కేసీఆర్ సర్వే అసంపూర్ణం.. కులగణనపై కమిటీ వేసింది కాంగ్రెస్.. సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**:కులగణనపై మా సర్వే పర్ఫెక్ట్.. అయినప్పటికీ కులగణనలో పాల్గొనని వారికోసం రెండోసారి కూడా సర్వే నిర్వహించాం..కొందరు పొద్దుపోని వారు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన సీఎం.. బీఆర్ ఎస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారు. అబద్ధాలపై ట్యాక్సులు వేయాలని పీఎం మోదీని కోరుతామని .. అలా అయినా అబద్ధాలు మాట్లాడకుండా ఉంటారని హాస్యంగా స్పందించారు. మా సర్వేలు చేసింది టీచర్లు.. మీ సర్వేలు చేసింది ఎవరో వివరాలు ఇవ్వాలని సీఎం బీఆర్ ఎస్ నేతలు వివరాలు చెప్పగలరా అని అన్నారు. గద్దర్ లాంటి వారు వస్తే.. అపాయింట్ మెంట్ ఇవ్వకుండా ఎండలో నిల్చోబెట్టిన చరిత్ర బీఆర్ ఎస్ ది.. గద్దర్ అవార్డు ఇచ్చి గౌరవించిన చరిత్ర కాంగ్రెస్ ది అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ఏనాడు ఉద్యమకారుల పేరు ఉచ్చరించలేదు..మేము అలాంటి వారిని సత్కరించుకున్నామని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఢిల్లీ పర్యటనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా స్పందించారు. ప్రధాని మోదీ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పెద్దన్న లాంటి వారు.. ఆయన్ను కలవడంలో రాజకీయమేముంది? అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు చాలా కీలకం. కేంద్ర సహాయంతోనే రాష్ట్ర ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయి. అందుకే కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించడం తప్పని సరి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## మెడిసిన్ కోసం మెడికల్ షాపుకు వచ్చిన కోతి..ఓనర్, కస్టమర్లు షాక్



**హైదరాబాద్ పెన్ పవర్:**విచిత్రమైన సంఘటన..గాయపడిన కోతిమెడికల్ అసిస్టెన్సీకోసం తనంతటతానే మెడికల్ షాపుకు వచ్చింది..కోతికి గాయాలు కనిపించడంతో అక్కడున్న కస్టమర్లు, మెడికల్ షాపు ఓనర్ దానికి ప్రథమ చికిత్సఅందించారు. ఈ ఘటన ఇటీవల బంగాదేశ్ లోని జరిగింది. దీనికి సంబంధించిన హార్ట్ టచ్చింగ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మనుషుల్లా కోతులు కూడా బాగా అప్డేట్ అయ్యాయని నెటిజన్లు తెగ కామెంట్లు చేస్తున్నారు. బంగ్లాదేశ్ లోని మెహెర్ పూర్ సిటీలో ఈ వింతైన ఘటన జరింగింది. గాయపడిన కోతి(కొండముచ్చు) వైద్య సహాయం కోసం ఓ మెడికల్ షాపులోకి వెళ్లింది. అల్వైరా ఫార్మసీ అనే మెడికల్ లో ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో బందించబడ్డాయి. ఆ ఫుటేజ్‌లో ఆ కొండముచ్చు ప్రశాంతంగా కౌంటర్‌పై కూర్చుని ఉండగా మెడికల్ షాపు సిబ్బంది, కస్టమర్లు ప్రాథమిక చికిత్స చేశారు. ఒక వ్యక్తి దాని గాయానికి ఆయిట మెంట్ పూయడం కనిపిస్తుంది. మరొక వ్యక్తి తన చేతులతో కోతిని పట్టుకుని సహాయపడుతున్నట్లు కనిపించింది. తర్వాత గాయపడిన చోట కట్టు చుట్టడం కనిపిస్తుంది. ఇదంతా కొండముచ్చు కదలకుండా ఉండి సహకరించడం అక్కడున్న వారిని, వీడియో చూసిన వారిని చాలా అశ్చర్యానికి గురి చేసింది. ఇక ఘటనకు సంబందించిన వీడియో ఇప్పుడు నెట్టింట బాగా వైరల్ అవుతోంది. కోతి గాయానికి చికిత్సకోసం సరిగ్గా మెడికల్ షాపుకు వెళ్లిన దాని తెలివితేటలను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు దయతో కోతికి చికిత్స చేసిన మెడికల్ సిబ్బంది, కస్టమర్లను అభినందించారు. మానవత్వం ఇంకా బతికేఉంది అని కొందరు నెటిజన్లు ప్రశంసిస్తుండగా.. జంతువులను ప్రేమతో సపర్యలు చేసే వారు వారికి అభినందనలు అంటూ మరికొందరు.. కోతులు కూడా మనుషులతో పాటు అప్డేట్ అవుతున్నాయని ఇంకొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## పిల్లల ముందు అలా మాట్లాడొద్దు.. అస్సలు మంచిది కాదు..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇంట్లో పెద్దల్ని బట్టే పిల్లలుంటారు. మాటతీరు, ఆలోచనల్నేం ి ల్లలూ అనుకరిస్తారు. కానీ, కొందరు పేరెంట్స్ ఇవేం పట్టించుకో కుండా పిల్లల ముందు ఏవేవో మాట్లాడతారు. ఇతరుల చర్మం రంగు, రూపం గురించి తక్కువ చేసి మాట్లాడుతుంటారు.కానీ పిల్లల ముందు అలాంటి మాటలు అస్సలు మంచివి కావు.పసివయసులోనే ఆ మాటలు చెవిన పడితే వాళ్లు కూడా మనిషి రూపాన్ని బట్టి వాళ్లతో బంధాలని ఏర్పరుచుకుంటారు. కాస్త చామనఛాయగా ఉన్నవాళ్లని తక్కువ చేసి చూస్తుంటారు. అందుకే పిల్లల ముందు రంగు, రూపం గురించి మాట్లాడకూడదు. ఒకవేళ వాళ్లకి అలాంటి భావాలున్నా వాటిని దూరం చేయాలి. మనిషికి రంగు, రూపం ముఖ్యం కాదు... ప్రవర్తన బట్టి స్నేహం చేయాలని చెప్పాలి. అంతేకాదు రూపం కారణంగానే ఎవరినీ తక్కువ చేసి చూడకూడదని చెప్పాలి.అలాగే పిల్లల ముందు ఇంట్లో పనివాళ్లని, సబార్డినేటర్లను చులకన చేసి మాట్లాడకూడదు. అలాచేస్తే వాళ్లకి కూడా వాళ్ల పట్ల చులకన భావమే కలుగుతుంది.

# రోజా ఇంట్లో రొయ్యల పులుసు తిన్నదెవరు? కేసీఆర్ అసెంబ్లీకి వస్తే అన్నీ చెప్తా: సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి మరణశాసనం రాసింది కేసీఆర్, ఆయన అల్లుడు హరీశ్ రావు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో అప్పటి మంత్రి ఉమాభారతి సమక్షంలో 2021%-%22లో తమకు 299 టీఎంసీలు చాలంటూ సంతకాలు చేసి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంగా నల్లగొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాలు ఎడారిగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిందంతా చేసి ఇప్పుడు తమపై ఆడిపోసుకుంటున్నారని ఫైర్ అయ్యారు.

ఇవాళ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. అజ్ఞానమే గొప్ప విజ్ఞానమనుకొని మాట్లాడుతున్నారని విమర్శించారు. జూరాల నుంచి పాలమూరు రంగారెడ్డి పథకానికి తీసుకోవాల్సిన నీటిని శ్రీశైలం నుంచి తీసుకునేలా ప్లాన్ మార్చారని ఆరోపించారు. జూరాల నుంచి పాలమూరు రంగారెడ్డికి నీటిని తరలించాలని కోరితే చిన్నారెడ్డిని కేసీఆర్ అవమానించలేదా? అని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే ప్లాన్ మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కరీంనగర్ తరిమేస్తే.. పాలమూరు అక్కున చేర్చుకొని ఎంపీని చేసి పార్లమెంటుకు పంపిన విషయాన్ని కేసీఆర్ మర్చిపోయారని అన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన పాలమూరు గడ్డకు తీరని అన్యాయం చేశారని అన్నారు. పోతిరెడ్డి పాడు పొక్క పెద్దగా చేసుకునేందుకు అనుమతులు ఇచ్చిందే కేసీఆర్ అని విమర్శించారు. వైఎస్ హయాంలో నాయిని నర్సింహారెడ్డి కడప జిల్లా ఇన్ చార్జి మంత్రి గా పనిచేసి.. మన నీటిని తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వలేదా..? అని ప్రశ్నించారు.

### కేసీఆర్ అసెంబ్లీకి వస్తే అన్నీ చెప్తా

కృష్ణా జాలాల్లో అన్యాయం ఎక్కడ ఎలా జరిగిందనేది కేసీఆర్ అసెంబ్లీకి వస్తే చెప్తానని సీఎం రేవంత్ అన్నారు. అడుగడుగునా రాష్ట్రానికి అన్యాయం చేసింది కేసీఆరే నని అన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని సవాలు విసిరారు. శ్రీశైలం నుంచి ప్రతి రోజూ 10 టీఎంసీల నీళ్లు పోతున్నాయని అన్నారు. తెలంగాణకు శాశ్వతంగా అన్యాయం చేసింది వాళ్లు అని అన్నారు. పల్లకీలో పార్లమెంటుకు పంపిన పాలమూరును కేసీఆర్ ఎండబెట్టారని అన్నారు.

నాగార్జున సాగర్ డ్యాంపైకి ఏపీ పోలీసులు వచ్చింది కేసీఆర్ హయాంలోనే అని అన్నారు. నాగార్జున సాగర్ ను ఏపీ పోలీసులు కబ్జా చేస్తుంటే కేసీఆర్ ఫాంహౌస్ లో పడుకున్నారని అన్నారు. మన పోలీసులను అక్కడి పోలీసులు కొడితే చీము నెత్తురు లేదా..? అని ప్రశ్నించారు. ఇందనా మీ పదేండ్ల అనుభవమని ప్రశ్నించారు. సభను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కుల దురహంకరాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని అన్నారు.

### రోజా ఇంట్లో రొయ్యల పులుసు తిన్నదెవరు?

మాజీ సీఎం కేసీఆర్ అప్పటి ఏపీ మంత్రి రోజా ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిని తెలంగాణకు తీరని అన్యాయం చేశారని సీఎం ఆరోపించారు. రొయ్యల పులుసు కోసం 71 ఏండ్ల పెంచి పోషించిన తెలంగాణ గుండెల మీద తంతవా... అని ప్రశ్నించారు. ఇదేనా నీ జాతి, నీతి అని అన్నారు.

# ఇలాంటి ఫుడ్ ఎక్కువగా తింటున్నారా.. మీకు లంగ్ క్యాన్సర్ వచ్చే ఛాన్స్ ఎక్కువ..!




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కాలంలో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య బాగా పెరిగింది. క్యాన్సర్ పై అవగాహన అవసరాన్ని మరింత పెంచుతోంది. ప్రతి లక్ష మందిలో 100మందికి క్యాన్సర్ ఉంది. 2022 నాటికి దేశంలో 14.60 లక్షల మంది క్యాన్సర్ పేషెంట్లు ఉన్నారు. ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి క్యాన్సర్ డెవలప్ అయ్యే అవకాశం ఉంది. 2025 నాటికి 12.8 శాతం క్యాన్సర్ రోగులు పెరిగే అవకాశం ఉందని రిపోర్టులు చెబుతున్నాయి. అయితే క్యాన్సర్ బారిన పడేందుకు మన జీవన శైలి, తీసుకునే ఆహారం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వీటిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. క్యాన్సర్లలో లంగ్ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనది. ప్రాణాంతకమైనది. ఇతర క్యాన్సర్లకంటే ఊపిరితిత్తులకు సోకిన క్యాన్సర్ కు ట్రీట్ మెంట్ కూడా కష్టంగా ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. లంగ్ క్యాన్సర్ కు కారణాల్లో మనం తీసుకునే ఆహారం ఓ ప్రధాన కారణం అంటున్నారు ఫ్లోరిడా హెల్త్ యూనివర్సిటీ పరిశోధకులు. పేలవమైన ఆహారం లంగ్ క్యాన్సర్ ఓ కారణమని అంటున్నారు. కొవ్వులు, ఫ్రక్టోజ్ లు ఎక్కువగా ఉండే జంక్ ఫుడ్స్ (ప్రాశ్చాత్య) గ్లైకోజన్ స్థాయిలను పెంచుతాయంటున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్?కు మనం తీసుకునే ఆహారం ఎలా కారణమవుతుందో ఈ పరిశోధనలు వెల్లడించాయి. క్యాన్సర్ నివారణకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో చెబుతున్నాయి.

ఈ ఫుడ్ తింటే.. ప్రాసెస్ చేసిన ఆహారాలు, నిల్వ ఉంచిన ధాన్యాలు, ఎర్ర మాంసం, అధిక కొవ్వు పాల ఉత్పత్తులు, చక్కెర ఉన్న డ్రింక్స్,ఫాస్ట్ ఫుడ్ ,ఉప్పగా ఉండే స్నాక్స్ వంటి ఆహార పదార్ధాల వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. అదేవిధంగా పండ్లు, కూరగాయలు ,తృణధాన్యాలు తక్కువగా తీసుకోవడం వల్ల కూడా లంగ్స్ క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుంది. ఇలాంటి ఆహారపదార్థాలు గ్లైకోజన్ స్థాయిని పెంచుతాయి. ఇది ఊపిరితిత్తులలో ట్యూమర్లను ఏర్పడేందుకు కారణమం అవుతాయని నేచర్ మెటాబాలిజమ్ అనే జర్నల్ లో లంగ్ క్యాన్సర్ పై అధ్యయనం రిపోర్టు ప్రచురించారు. శాస్త్రవేత్తలు ఎలుకలపై ఈ ప్రయోగం జరిపారు. వాటికి అధిక కొవ్వు, అధిక ఫ్రక్టోజ్ ఉన్న జంక్ ఫుడ్ ఇచ్చినప్పుడు రక్తంలో గ్లైకోజెన్ బాగా పెరిగింది. ఊపిరితిత్తుల్లో కణితులు పెరిగాయి. గ్లైకోజెన్ స్థాయిలు తగ్గినప్పుడు కూడా కణితి పెరుగుదల ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

# 'ఎక్స్' వేదికగా హర్షసాయి బాగోతం బయటపెట్టిన వీసీ సజ్జనార్




**హైదరాబాద్ పెన్ పవర్:** కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్న బెట్టింగ్ యాప్స్?పై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉక్కుపాదం మోపారు. బెట్టింగ్ యాప్స నిర్వాహకులు వెదజల్లే కాసులకు కక్కుర్తి పడి ఆ యాప్స?ను ప్రమోట్ చేస్తున్న ఈ సో కాల్డ్ సోషల్ మీడియా ఇన్?ఫ్లూయెన్సర్?కు కూడా సజ్జనార్ చుక్కలు చూపిస్తున్నారు. మొన్న వైజాగ్ లోకల్ బాయ్ నాని, నిన్న భయ్యా సన్నీ యాదవ్.. ఇవాళ హర్ష సాయి బెట్టింగ్ ప్రమోషన్స బాగోతాన్ని వీసీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా బయటపెట్టారు. తప్పు చేస్తుందే కాకుండా నిస్సిగ్గుగా బెట్టింగ్ యాప్స?ను ప్రమోట్ చేయడాన్ని సమర్థించుకుంటూ హర్ష సాయి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటల వీడియోను సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. చేస్తున్నదే తప్పు.. అదేదో సంఘసేవ చేస్తున్నట్టు ఎంత గొప్పలు చెప్పుకుంటున్నాడో చూడండని కలియుగ దాన కర్ణుడిగా చెప్పుకునే హర్ష సాయి బండారాన్ని వీడియోతో సహా సజ్జనార్ బయటపెట్టారు. ఇన్?ఫ్లుయెన్సర్లు ఎవరికైనా స్వచ్ఛందంగా సాయం చేస్తే అభినందించడంలో తప్పు లేదు గానీ ఏం చేసి సంపాదించినా తప్పు లేదనే భావన నుంచి వీళ్లను ఫాలో అయ్యే యువత బయటపడాలని కొందరు నెటిజన్లు సజ్జనార్ పోస్ట్ చేసిన హర్ష సాయి వీడియో కింద కామెంట్స్ రూపంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చేస్తున్నదే తప్పు.. అదేదో సంఘసేవ చేస్తున్నట్టు ఎంత గొప్పలు చెప్పుకుంటున్నాడో చూడండి. తాను బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయకుంటే ఎవరో ఒకరు చేస్తారని ఈయన చేస్తున్నాడట. బుద్దుందా అసలు!ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లు కుటుంబాలను బలి తీసుకుంటున్నాయి. కొడుకులు చేసిన అప్పులు తల్లిదండ్రుల ప్రాణాలను బలితీసుకుంటున్న ఘటనలు సర్వసాధారణంగా మారాయి. ఇంట్లో ఒక్కరి వ్యసనం.. మొత్తం కుటుంబం పాలిట శాపంగా మారుతున్నది. మొబైల్‌ఫోన్‌ఓపెన్ చేస్తే చాలు..“వన్ ఎక్స్‌బెట్, మెగాపరి, మోస్ట్‌బెట్, పరిమ్యాచ్, 10 సీఆర్‌ఐసీ, మెల్‌బెట్, మేట్‌బెట్, 1ఎక్స్ బెట్, బీసీ డాట్ గేమ్, 22 బెట్, రాజా బెట్స్, బెట్ 365, స్టేక్ డాట్ కమ్, డఫ్పా బెట్” లాంటి వందలాది అఫీషియల్, అన్‌అఫీషియల్ ఆన్‌లైన్‌బెట్టింగ్‌యాప్స కనిపిస్తున్నాయి. యూట్యూబ్, సోషల్‌మీడియా, వెబ్?సైట్లలో వంద రూపాయలు పెడితే రూ. వెయ్యి ఇస్తామంటూ బెట్టింగ్ యాప్స‌యాడ్స‌దర్శనమిస్తున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగుల కోసం ఇంటి పేపర్లు, కార్లు, భూములు వంటి ఆస్తులను తాకట్టు పెట్టి మరీ అప్పులు తీసుకుంటున్నారు. ఎక్కడా డబ్బులు పుట్టకపోతే లోన్?యాప్స?లో అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటున్నారు. ఇందులో రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు అప్పులు చేసినోళ్లు కూడా ఉన్నారు. సమయానికి అసలు, కిస్తీలు కట్టకపోవడంతో అప్పులు ఇచ్చినోళ్లు, లోన్ యాప్? నిర్వాహకుల నుంచి వేధింపులు ఎక్కువవుతున్నాయి. ఇంట్లో వాళ్లకు చెప్తామని, చుట్టుపక్కల వాళ్లకు చెప్తామని, కోర్టులకు లాగుతామని బెదిరిస్తుండడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రులకు పెద్దన్న లాంటి వారు: రేవంత్ రెడ్డి

- ప్రధానిని కలవడంలో రాజకీయం ఏముంటుందన్న రేవంత్ రెడ్డి
- ఢిల్లీ పర్యటన పేరుతో దుబారా చేయడం లేదని విమర్శ
- కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగించాలని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పెద్దన్న లాంటి వారని, అలాంటి వ్యక్తిని తాను కలవడంలో రాజకీయం ఏముంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటన పేరుతో తాను దుబారా చేయడం లేదని వెల్లడించారు. ప్రధాని, కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడతాయని ఆయన అన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగించాలని ఆయన వ్యాఖ్యానించారు. కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమే ప్రధాని నరేంద్ర మోదీని కలిశానని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రధానిని గౌరవించే విజ్ఞత తమదని, కానీ రాజకీయాల విషయానికి వచ్చినప్పుడు తాను కాంగ్రెస్ నేతను, మోదీ బీజేపీ నాయకుడు అని స్పష్టం చేశారు. అవసరమైతే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని ఢిల్లీకి తీసుకువెళతామని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నాలుగుసార్లు కలిశామని, నిర్మలా సీతారామన్, అమిత్ షాలను కూడా కలిసినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌ను నాశనం చేశారని ఆరోపించారు. చెరువులు, కుంటలు మాయం చేశారన్నారు. నగరంలోని అపార్టుమెంట్లకు తగిన డ్రైనేజీ వ్యవస్థ లేదని ఆయన అన్నారు. చెరువులను, కుంటలను పునరుద్ధరించాలని తాము ప్రయత్నిస్తుంటే అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ పడేలా నగరాన్ని నిర్మించాలని చూస్తే అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు.

## బీఆర్ఎస్ నిరసన సీఎం దిష్టిబొమ్మ దగ్ధం

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేసారు. పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

## గోపాల్ రావు పేటలో అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు:

**హైదరాబాద్ పెన్ పవర్:**
రామడుగు మండలం గోపాల్ రావు పేట గ్రామం లోని శ్రీ వెంకటేశ్వర స్వామి 26వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ప్రభాత పారాయణం జరుగును. డింగరి సత్యనారాయణ చార్యుల పర్యవేక్షణలో అధ్యాపకులు దీక్షిత ఆచార్య శ్రీ కుమార్ లతో శ్రీ శ్రీ శ్రీ శ్రీహరి మౌన స్వామి(రోటి గూడెం) వారి ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఉదయం తొమ్మిది గంటల నుండి వెయ్యి మంది స్త్రీమూర్తులచే కుంకుమ పూజ జరుగును. మధ్యాహ్నం 12:48 నిమిషాలకు చిత్త నక్షత్ర మిధున లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ అలివేలు మంగ పద్మావతి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభోగంగా జరుగును. కావున వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ చైర్మన్ నార్ల రమేష్ ధార్మిక వ్యాఖ్యాత దోనపాటి సీతారాం రెడ్డి ఆలయ కమిటీ డైరెక్టర్లు ఆలయ అర్చకులు భజన మండలి భక్తులు గ్రామ ప్రజలు కోరారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీసే వేదిక యువ ఉత్సవ్

- జిల్లా కేంద్రంలో నిర్వహించిన నెహ్రూ యువకేంద్ర మై భారత్

**హైదరాబాద్ పెన్ పవర్:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విద్యార్థులతో పాటుగా యువతలో ఉన్న వివిధ రకాలనైపుణ్యాలు వెలికితీసే వేదికగా నెహ్రూ యువకేంద్రం, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ నిలిచిందని జిల్లా విద్యాధికారి రాజేందర్ ప్రశంసించారు. జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ డ పీజీ కళాశాలలో కార్యక్రమ నిర్వాహకులైన నెహ్రూ యువకేంద్ర మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మాట్లాడుతూ, పంచప్రాణ్ అనే అంశాలతో ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

భారత ప్రభుత్వం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలిచే లక్ష్యంతో చేస్తున్న కృషిలో భాగంగా యువ ఉత్సవ్‌లో విద్యార్థులను భాగం చేస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం చేపడుతున్న కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనడం సంతోషకరం అని అన్నారు.యువ ఉత్సవ్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా జిల్లా విద్యాధికారి రాజేందర్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా సంబంధమైన అంశాలతో పాటుగా ఇతర అంశాల్లోనూ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. ఆయా నైపుణ్యాలను వెలికితీసే విధంగా నెహ్రూ యువకేంద్ర మై భారత్ యు వ ఉత్సవ్ నిలిచిందని కొనియాడారు. ఏడు పోటీలలో పాల్గొన్న విజేతలకు అభినందనలు తెలిపారు. జిల్లా యువజన సంక్షేమాధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని ప్రశంసించారు. యువతీ యువకులు ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలని సూచించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ సూరునేని మాట్లాడుతూ, యువత చదువుతో పాటుగా పోటీ పరీక్షలు, వ్యక్తిత్వ వికాసం అంశాలపై సైతం దృష్టి పెట్టాలని కోరారు. విజేతలుగా నిలిచే విధంగా వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా సైన్స్ అధికారి స్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని సూచించారు.
కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, అధ్యాపక బృందం, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# దావాజీపల్లి ప్రైమరీ స్కూలు దృష్టి పెట్టాలి

హైదరాబాద్ పెన్ పవర్: ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో దృష్టి పెట్టండి. లక్షల కోట్ల అప్పులలో కనీసం వెయ్యికోట్ల పెడితే విద్యార్థులకు మేలు అవుతుంది కదా? జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న దావాజిపల్లి ప్రైమరీ స్కూల్ పై చిన్న చూపేలా అని మంత్రి జూపల్లి కి అఖిలపక్ష ఐక్యవేదిక విన్నవించింది. శనివారం పానుగల్ మండలంలోని దావాజిపల్లి గ్రామ ప్రజల, మరియు విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు దావాజిపల్లి లోని ప్రైమరీ స్కూల్ ను అఖిలపక్ష ఐక్యవేదిక సందర్శించడం జరిగింది. అక్కడ విద్యార్థులకు సరైన భవనం లేక , ఉన్న భవనానికి కాంపౌండ్ వార్డు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అలాగే విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలకు కోరుతున్నారని జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు ఇదేవిధంగా ఉండి అవస్థలు పడుతున్నారని, కొన్ని స్కూళ్లలో సరైన రూములు లేక ఆరు బయట కూర్చుంటున్నారని, ప్రభుత్వం అనవసరమైన ఖర్చులు తగ్గించి విద్యార్థులకు మరియు వైద్యానికి ఖర్చు చేయాలని ఈ సందర్భంగా ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నదని, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు , జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి వీటిపై శ్రద్ధ వహించి విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, బిసి జిల్లా సంఘం నేత గౌనికాడి యాదయ్య, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, బొడ్డుపల్లి సతీష్, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడండి

### ఎంపీడీవో సత్యన్న,,గ్రామ సర్పంచ్ పాల్ దినకర్

### గ్రామంలో భారీగా ర్యాలీ

హైదరాబాద్ పెన్ పవర్:ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని దాని వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని గ్రామంలో పంచాయతీ కార్యాలయం నుంచి స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అంటూ జిల్లా అధికారులు,ఎంపీడీవో సత్యన్న,ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ దినాకర్ ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ లో వారు మాట్లాడుతూ..ప్లాస్టిక్ వాడకన్ని తగ్గించండి. భూమిని కాపాడలని ప్రతిరోజు చర్యలు ముఖ్యమైనవి, ప్లాస్టిక్ రహిత జీవితాన్ని ఎంచుకోవా లనిభూమి దినోత్సవం నాడు మాత్రమే కాకుండా ప్రతిరోజు ప్లాస్టిక్ నో చెప్పాలని ఆలోచించండి, ప్లాస్టిక్లను నివారించండి.కాగితపు సంచలను ఉపయోగించండి, ప్లాస్టిక్ సంచలను ఉపయోగించడం మానేయలని పచ్చని రేపటి కోసం ప్లాస్టిక్ కు నో చెప్పండి ప్లాస్టిక్ వాడటం మానేయండి మరియు ప్రాణాలను నుంచి రక్షణ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యన్న , పంచాయతీ, ఈ ఓ యోగేశ్వర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ పంచాయితి అధికారి బి. శివప్ప అలాగే సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇస్కాన్ ఆలయంలో చైతన్య మహాప్రభు 538వ ఆవిర్భావ తిథి

హైదరాబాద్ పెన్ పవర్:ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ చైతన్య మహాప్రభ 538వ ఆవిర్భావ తిథి అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా అత్తాపూర్లోని ఇస్కాన్ ఆలయం లో హరే కృష్ణ నామజపంతో మార్మోగిపోయింది. కార్యక్రమంలో ఐదువేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7.30 గంటలకు దర్శన హారతి నిర్వహించారు. 8 గంటల నుంచి శ్రీ చైతన్య మహా ప్రభు లీలలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. సాయంత్రం మహా అభిషేకం, చప్పన్ భోగ్ నైవేద్యం గౌర హారతి అందించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 2 వేల మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయం వేదికగా ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్య ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభు పాద మార్గదర్శకత్వంలో సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టుల అభివృద్ధి, గో సంరక్షణ, భగవద్గీత, భాగ వతం వంటి వేద పుస్తకాల పంపిణీ చేపడుతు న్నామని నిర్వాహకులు తెలిపారు.

# మురికి కాలువల్లోకి మిషన్ భగీరథ నీళ్లు

- లీకులు సరి చేయరు... మరమ్మతుల ఊసు లేదు
- సిబ్బంది నిర్లక్ష్యం అధికారుల పట్టింపు లేని తనం
- రోజు గంటల తరబడి వేల లీటర్లు నీరు వృథా
- నీటి వృథా అరికట్టకపోతే వేసవి కష్టాలు తప్పవు
- జిల్లా కేంద్రంలో ఎక్కడైనా ఇదే కథ





పెద్దపల్లి పెన్ పవర్:మంచి లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా మొదలైన మిషన్ భగీరథ ఇంటింటికి నల్లా నీరు పెద్దపల్లి జిల్లాతో పాటు పెద్దపల్లిలో నిర్వహణ లోపం, అసంపూర్తి పనులు, కాంట్రాక్టర్ల అవినీతి, అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతో ఇప్పటికి అబాసు పాలవుతూనే ఉన్నది. పెద్దపల్లి పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరా, పర్యవేక్షణ అధికారం మున్సిపల్ కమిషనర్ అధీనం లో ఉన్నది. మున్సిపల్ లో 36 వార్డులు ఉండగా నీటి సరఫరా నీటి సరఫరాను ప్రతి వార్డులోని ఆయా గల్లీలకు రోజు వారి పద్ధతిలో వదులుతున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, అసలు సమస్య నిత్యం కొన్ని వేల లీటర్లు వృధాగా పోతూనే ఉన్నాయి. కాంట్రాక్టర్లు పంపుల బిగింపు సరిగా చేయక పోవడం, దానికి తోడు నీటి అవసరం లేని వాళ్ళకు కూడా పైపులు బిగించారు. దీంతో పలు వార్డుల్లో ప్రజలు నీటి లీకేజి సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా, నీటి అవసరం లేని వాళ్ళు మాత్రం సదరు భగీరథ మంచినీటిని మురికి కాలువలు, సెప్టిక్ ట్యాంక్ ల్లోకి వదిలి పెడుతున్నారు. దీంతో పలు వార్డుల్లో రోజు కొన్ని వేల లీటర్లు మంచి నీరు వృధాగా పోతున్నాయి. ఇక నీటిని వదిలే సిబ్బంది సమయ పాలన లేకపోవడం మరి దారుణం. నీటిని వదిలితే సుమారు రెండు గంటల వరకు కూడా నీరు వృధాగా పోతున్నా పట్టించుకోరు. తమ డ్యూటీ వదలడం, నిలిపి వేయడం మాత్రమే అంటున్నారు. అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా వారి జాడ ఎక్కడ కానరావడం లేదు. ఇలా ప్రతి నిత్యం 36 వార్డుల్లో కొన్ని వేల లీటర్లు నీరు వృధాగా పోతున్నా నివారణ చర్యలు శూన్యం. అసలే ఎండా కాలం ఇంకా రెండు నెలలు బానుని తీవ్రత పెరుగు తున్నది. నీటి కష్టాలు కొన్ని ప్రాంతాల్లో ప్రారంభమైనా, ఇక్కడి మున్సిపల్ అధికారులకు మాత్రం విధి నిర్వహణ మరిచిపోయినట్లు ఉన్నారు. దీనికి తోడు ప్రతి వార్డులో నీటి లీకేజీలు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ మరమ్మతులు చేసినా అవి లాంటి ఫలితాలు ఇవ్వకపోగా భారీ ఎత్తున నీటి లీకేజిలతో చిన్నపాటి కాలువలు తలపిస్తున్నాయి. ప్రతినిత్యం పట్టణంలో తిరిగే అధికారులకు ఈ దృశ్యాలు ఎందుకు కనిపించడం లేదో అర్థం కానీ ప్రశ్న. జిల్లా అధికారుల సమీక్షలు కూడా వీరి నిర్లక్ష్యంతో వృధా ప్రయాసే అవుతున్నది. పట్టణంలోని అమర్ నగర్, సుభాష్ నగర్, జెండా చౌరస్తా గల్లీ, తెనుగువాడ ఇలా చెప్పుకుంటూ పోతే ఏ వార్డు పరిశీలించిన ఇదే తంతు కొనసాగుతున్నది. అలాగే రోడ్డు మీద చాలా మంది భగీరథ నీరును వాహనాలు శుభ్రం చేసుకోవడం తదితర పనులకు వినియోగించు కోవడం కూడా జరుగుతున్నది. ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చేలా కొన్ని కోట్ల వ్యయంతో బృహత్తార పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంటే, అధికారుల నిర్లక్ష్యం మూలంగా వృధా అవుతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నీటి వృధాను, లీకేజిలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. వేసవి నీటి కష్టాలు రాకముందే మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# 12వ వార్డు రాజనగరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

హైదరాబాద్ పెన్ పవర్:ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు రాజనగరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం వనపర్తి కాంగ్రెస్ టౌన్ కమిటీ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్ మాట్లాడుతూ ... 12వ వార్డు రాజనగరం అభివృద్ధి లో పరుగులు పెట్టాలని, రోడ్లు, వంతెనలను, డ్రైనేజ్ వ్యవస్థను, లెవెన్ కె.వి కరెంటు వైర్లు తొలగింపులోనూ , అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేక దృష్టితో రాజనగరం ని అభివృద్ధి పరచడానికి సిద్ధంగా ఉన్నామని, రాబోయే స్థానిక కౌన్సిలర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని చీర్ల చందర్ అన్నారు.కార్యకర్తలు అందరూ సమిష్టిగా కలిసి పనిచేయాలని వారు దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ చీర్లచందర్ తో పాటు అడ్వకేట్ బుచ్చన్న , కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి , నాగిరెడ్డి , మాజీ సర్పంచ్ కృష్ణయ్య , మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి నక్కరాజు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగు రామకృష్ణ, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తగొల్ల శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండు వైస్ చైర్మన్ ముద్దంగుల శీను, మాజీ డైరెక్టర్ సంజీవ్ సాగర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పరి డి. రాములు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెండం కురుమూర్తి (ఆటో ), సారగండ్ల మన్యం , మాజీ వార్డు మెంబర్ దేశెట్టి రాములు, సీనియర్ నాయకులు గొడుగు సత్యనారాయణ, గిర్ని రాములు, ఉప్పరి నారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీ, జిల్లా సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ ప్రభుత్వం

## బీఆరెస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు



**ములుగు  పెన్ పవర్:** ఇచ్చిన హామీలని నెరవేర్చలేనప్పుడు అధికార పార్టీ నాయకులు పదవుల్లో కొనసాగడం ఎందుకని, బహిరంగంగానే హామీలను నేరవేర్చలేమని చేతులు ఎత్తేస్తున్న ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమరి లక్ష్మీనరసింహారావు అన్నారు. కాగా శనివారం రోజున ఏటూరునాగారం మండల కేంద్రంలోని మరో జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు ఆయన స్వగృహంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సస్పెండ్ పై తీవ్రంగా ఖండించారు. హేయమైన చర్యకు నిరసన తెలిపే స్వేచ్చను కూడా కోల్పోయమన్నారు.

పోలీసులతో అడ్డుకుని నిరంకుశ పాలన చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం ములుగు నియోజక వర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీతక్క ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో సారవంతమైన భూములు ప్రతీ యేట వరద ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 133 కోట్లతో కరకట్ట పనులు చేపట్టారు కాగా ఆ పనులను ప్రారంభించినట్లే చేసి మధ్యలో నిలిపి వేశారు వెంటనే ఆ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన రైతు బంధును పూర్తి స్థాయిలో అమలు చేసి రైతులను ఆదుకోవాలి కోరారు. మంగపేట మండలం కమలాపురం బిల్ట్ కార్మాగారం ప్రారంభం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని

కార్మాగారం ప్రారంభమయ్యేలా చేసి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. అంతేకాకుండా దొడ్ల - కొండాయి వద్ద జంపన్నవాగు పై బ్రిడ్జీ నిర్మాణం నిలిచిపోయి గిరిజన ప్రాంతాలైన కొండాయి, మల్యాల, ఐలాపూర్ గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి తీర ప్రాంత రైతుల ప్రధాన పంట మిర్చి గిట్టుబాటు ధర లేక మిర్చీ రైతులు ఆర్దికంగా నష్టపోతున్నారని మద్దతు ధర క్వింటాకు 25 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. 6 గ్యారెంటీ హామీలతో గద్దనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంకు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెబుతారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ బాబు, బీఆర్ఎస్ పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షులు గడదాసూ సునీల్ కుమార్, టౌన్ అధ్యక్షులు ఖాజాపాషా, మంగపేట మండల అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య, జిల్లా నాయకులు పోరిక గోవింద్ నాయక్, తుమ్మ మల్లారెడ్డి, గండేపల్లి నర్సయ్య, తాడూరి రఘు, జాడీ భోజరావు, పూజారి కిషోర్, కుమ్మరి చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# భూమి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాజ్యాంగ స్ఫూర్తితోనే మనమా వ్యవస్థలను నడుపుతున్నాం. 2022 బడ్జెట్ సమావేశాల్లో గత ప్రభుత్వం గవర్నర్ ప్రసంగం లేకుండానే సమావేశాలు నిర్వహించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం అయన శాసనసభలో మాట్లాడారు. మహిళా గవర్నర్ ను అవమానించేలా వ్యవహరించారు. కానీ మా ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవస్థలను సంస్థలను గౌరవించుకుంటూ ముందుకు వెళుతున్నాం . సీనియర్లమని, పదేళ్లు మంత్రులుగా చేసినమని చెప్పుకునేవాళ్లు గవర్నర్ ప్రసంగాన్ని తప్పుబట్టారు. వాళ్లు వారి అజ్ఞానాన్నే తమ విజ్ఞానమని అనుకుంటున్నారు. మంత్రివర్గం ఆమోదం పొందిన అంశాలనే గవర్నర్ తమ ప్రసం గంలో వినిపించారు. ఎలక్షన్ మేనిపెస్టోలోని అంశాలను ప్రభుత్వంలో అమలు చేస్తున్నాం. మేం అమలు చేసే వాటినే మంత్రి వర్గం ఆమోదించి గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచాం. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే? గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఉండదు. పదేళ్లు పాలించినవారు మంత్రివర్గం ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారా? వాళ్లకు గవర్నర్ పై గౌరవం లేకనే మహిళను అవమానించారు. ఇది ప్రజా ప్రభుత్వం.. మేం రాజ్యాంగబద్ధంగా వ్యవస్థను గౌరవిస్తాం. సభ్యులు ప్రస్తావించిన అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుంటాం. వారి సూచనలు తీసుకునేందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. పదేళ్ల విధ్వంసం, నియంతృత్వాన్ని పారద్రోలి ప్రజలు మార్పును కోరుకున్నారు? అందుకే ప్రజల ఆశీర్వాదంతో మేం ఇక్కడ ఉన్నాం. తెలంగాణ ప్రజలు 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసమే గతంలో తెలంగాణలో పోరాటాలు జరిగాయి. భూమి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం. రైతులకు రూ. 20624 కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర మా ప్రభుత్వానిది. రైతులు ఆత్మగౌరవంతో బ్రతికేలా చేసిన ఘనత మా ప్రభుత్వానిది. ఎన్నికలను అడ్డు పెట్టుకుని ఆనాటి ప్రభుత్వం రైతు బంధు ఎగ్గొడితే. మేం అధికారంలోకి వచ్చిన మొదటి మూడు నెలల్లో రూ. 7625 కోట్లు రైతు బంధు రైతుల ఖాతాల్లో వేసింది మా ప్రభుత్వమని అన్నారు. రైతు భరోసాను రూ. 12 వేలకు పెంచిన ఘనత మా ప్రభుత్వానిది. భూమిలేని నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 12 వేలు అందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని ఆనాటి ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయలేదు. వరి వేస్తే ఉరే అని మాట్లాడారు. కానీ మేం ధాన్యం కొనుగోలు చేసి రూ. 1206 కోట్లు సన్న వడ్లకు బోనస్ అందించాం. కాళేశ్వరం లేకుండానే రైతులు 1 కోటి 56 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారు. రైతు కమిషన్ ఏర్పాటు చేసి రైతుల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. పోరాటాలు చేశామని చెప్పుకునే వారు ఆనాడు చంద్రబాబుకు మోకరిల్లి 299 టీఎంసీలు చాలని సంతకం పెట్టి తెలంగాణకు శాశ్వత మరణ శాసనం రాసింది వాళ్లు కాదా? మేం అధికారంలోకి రాగానే కేంద్రంను కలిసి నీళ్ల కోసం కొట్లాడాం. వైస్ ఆశీర్వాదంతో కేంద్ర మంత్రి అయిన కెసీఆర్ పోతిరెడ్డిపాడు పొక్కను పెద్దది చేస్తుంటే చూస్తూ ఊరుకున్నది నిజం కాదా. తెలంగాణ జిల్లాలను వలస జిల్లాలుగా మార్చి రైతులను పొట్టన పెట్టుకుంది వీళ్లు కాదా . ఆనాడు వీళ్లు సహకరించకపోతే పోతిరెడ్డి పాడు పొక్క పెద్దదయ్యేదా అని అన్నారు.

కెసిఆర్ కాంట్రాక్టర్లు ఇచ్చిన కమీషన్ల కోసం కక్కుర్తి పడి జూరాలను రెండు టీఎంసీ ల నుంచి ఒక టీఎంసీకి తగ్గించి? నీళ్లను శ్రీశైలంకి పంపించడం వల్ల ప్రాజెక్టును పూర్తి చేసినా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. ఎస్ఎల్బీసీని నాలుగేళ్లల్లో పూర్తి చేయాల్సింది పదేళ్లయినా పూర్తి చేయకుండా నల్లగొండకు అన్యాయం చేసింది నిజం కాదా. ఇవాళ జరిగిన ఎస్ఎల్బీసీ ప్రమాదానికి, ఎనిమిది మంది చావుకు కారణం మీరు కాదా. కృష్ణా పరివాహక ప్రాంతంలో పదేళ్లలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదు. మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి వస్తుందని ఇవాళ సభ నుంచి వెళ్లిపోయారు. 15 నెలల్లో కెసిఆర్ సభకు కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారు.

## బిర్యానీతో పాటు బావర్చీ హలీం

**హైదరాబాద్ పెన్ పవర్:** సమయంలో హలీం వంటకాలను తినడం అనవాయితీ. ఈ మాసంలో హలీం వంటకాలకు ఉన్న క్రేజీయే వేరు . వెజ్ ,నాన్ వెజ్ హలీంలకు ఈ మాసంలో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్ ముషీరాబాద్ ఆర్టీసీ ఎక్స్ రోడ్ లోని బావర్చి రెస్టారెంట్ లో బిర్యానీతో పాటు రంజాన్ మాసంలో హలీం రుచులను అందించేందుకు ముందుకు వచ్చినట్లు సంస్థ డైరెక్టర్ సల్మాన్ మన్సూరి తెలిపారు. ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా బావర్చి రెస్టారెంట్ కస్టమర్లకు సాంప్రదాయ పద్ధతుల్లో హలీం వంటకాల రుచులు అందించేందుకు ముందుకువచ్చిందన్నారు. మాంసం, నెయ్యి ,గోధుమలు, బియ్యం,మసాలాలు, డ్రై ఫ్రూట్స్ తో గంటల తరబడి ఉడికించి తయారు చేస్తున్నామని తెలిపారు. 31 ఏళ్ళుగా ఈ ప్రాంత ప్రజలకు రుచికరమైన హలీం వంటకాలను అందిస్తున్నట్లు సల్మాన్ మన్సూరి తెలిపారు.

## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రాన్ని ఆరోగ్యంధ్రప్రదేశ్ గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నం మండలం పాముదుర్తి లో రూ. 1కోటి 79 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. పాము దుర్తి కి విచ్చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం ఆంధ్రప్రదేశ్లో ప్రజలకు అందించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ వారికి ఉచితంగా ఆయా జబ్బులకు సరిపడే మెడిసిన్ కూడా ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో పేదలకు కనీసం వైద్యం కూడా సక్రమంగా అందలేదని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా అందించే వైద్యం కూడా ప్రజలు నోచుకోలేక పోయారని,ఇందుకు కారణం అప్పటి ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ డబ్బులు ఇవ్వకపోవడమే అన్నారు. వైసిపి ప్రభుత్వ నిర్వాహకం వల్ల రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ పడక వేసిందని ,దీంతో పేద ప్రజలు వైద్య సేవల కోసం ప్రవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అప్పులపాలైయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కూటమి ప్రభుత్వం లో వైద్య ఆరోగ్యశాఖ కు పెద్ద పీట వేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, గత వైసిపి పాలనలో ఆరోగ్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మారడం ఖాయం అన్నారు. ఈ రాష్ట్ర బడ్జెట్ లో ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ ద్వారా బకాయి పడిన నిధులను మంజూరు చేసిన విషయాన్ని మాజీ మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధిస్తోందోని ,ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యసేవలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ గుర్రం పాటి జ్యోతి , మెడికల్ ఆఫీసర్లు జ్యోతి ,వెంకట నారాయణ రెడ్డి,టీడీపీ మండల కన్వీనర్ మల్లి రెడ్డి ,కృష్ణమూర్తి ,గంగాధర్ , నరేష్ , ఆంజనేయులు ,కిష్టప్ప ,శివారెడ్డి ,కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలి




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు రావాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రంలో నూతన పింఛన్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం దోమ మండల అధ్యక్షులు చుక్కయ్య ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పోతరాజు అధ్యక్షతన నిర్వహించిన దోమ ఎంపీడీవో కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే అదే నెల నుంచి వికలాంగుల పింఛను 6000 పెంచుతామని ఆర్టీసీలో వికలాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని రాజస్థాన్ చతిస్గడ్ రాష్ట్రాల్లో తమ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించిన మాదిరిగానే తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చి వికలాంగుల ఓట్లను కొల్లగొట్టి ముఖ్యమంత్రిగా గద్దనెక్కిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా తన 14 నెలల పాలనలో వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా వికలాంగుల సమాజాన్ని మోసం చేస్తున్న తీరు దురదృష్టకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తన తీరు మార్చుకొని అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేచ్చేందుకు ముందుకు రావాలని ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలు వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించడంతోపాటు రాష్ట్రంలో చాలీచాలని పింఛన్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వికలాంగుల పెన్షన్ తక్షణమే 6000 కు పెంచడంతోపాటు రాష్ట్రంలో నూతన పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు బీడీ కార్మికులకు గీతా కార్మికులకు వెంటనే నూతన పింఛన్లు విడుదల చేయాలని రాష్ట్రంలో వికలాంగుల అందరికీ వెంటనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరుచేసి ప్రత్యేక శాఖగా గుర్తించి ప్రత్యేక బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని లేకుంటే భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు

## హ్యాపీ హోలి అంటూ యాసిడ్ దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:**హోలీ పండగ రోజున హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సైదాబాద్ భూలక్ష్మీ మాతా ఆలయం అకౌంటెంట్‌పై యాసిడ్ దాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోపలికి వచ్చి 'హ్యాపీ హోలీ' అంటూ అకౌంటెంట్ తలపై యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో అకౌంటెంట్ నర్సింగ్ రావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నర్సింగరావును ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి.. ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.సాయంత్రం సమయంలో ఆలయం లోపలికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి హ్యాపీ హోలీ అంటూ అకౌంటెంట్ నర్సింగ్ రావుపై యాసిడ్ పోశాడు. దాడి అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దారుణ ఘటనకు సంబందించిన దృశ్యాలు సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి.. ఈ ఘటనతో ఆలయ పరిసర ప్రాంతాల్లో భయాందోళన నెలకొంది.. తీవ్ర గాయాలతో అకౌంటెంట్ విలవిలాడిపోయారు..కాగా.. సైదాబాద్ ఆలయంలో యాసిడ్ దాడి ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పట్టుకునే పనిలో ఉన్నారు.

# జర్నలిస్టు పేరుతో చేసే ఆరాచకాలు అడ్డుకుంటాం..

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వ్యక్తులు జర్నలిస్టులు ఎలా అవుతారని ప్రశ్నించారు రేవంత్ రెడ్డి. ప్రభుత్వం గుర్తించిన పత్రికలు, మీడియా సంస్థలు, అక్కడ పని చేసే ప్రతినిధులు జర్నలిస్టులా లేకా కుటుంబాలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వాళ్లు జర్నలిస్టులా అని ప్రశ్నించారు. వాళ్ల కామెంట్స్ చూస్తుంటే రక్తం మరిగిపోతుందని అన్నారు. ప్రజాజీవితంలో ఉన్నాం కాబట్టి ఊరుకొని ఉంటున్నామని అన్నారు. లేకుంటే పరిస్థితి ఇంకోలా ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. గతంలో ఛానల్స్ ఏదో సెటైరిక్ స్టోరీలు వేస్తే వాటిని ఆ ఛానల్స్‌ను కేసీఆర్ ఏడాది పాటు బ్యాన్ చేశారని గుర్తు చేశారు. అలాంటిది తాము ఎవర్నీ ఏమి అనడం లేదని తెలిపారు. కానీ జర్నలిజం ముసుగులో కొందరు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని వాటిని చూస్తుంటే రక్తం మరిగిపోతుందని అన్నారు. అసలు జర్నలిస్టులు అంటే ఎవరని... వారిని అలా గుర్తింపు ఇచ్చింది ఎవరని ప్రశ్నించారు. జర్నలిస్టు ముసుగులో చేసే కామెంట్స్‌పై అందరూ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి కొన్ని రెగ్యులరేషన్స్ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇదో విష సంస్కృతిలా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్టు కామెంట్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే చాలా బాధ కలుగుతుందన్నారు రేవంత్. అందుకే దీనిపై అందరూ బాధ్యతగా స్పందించాలని సూచించారు. అవసరమైతే చట్టం తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. జర్నలిస్టు సంఘాలతో మాట్లాడాలని సూచించారు. జర్నలిజం ముసుగులో కొందరు చేసే వ్యక్తిగత కామెంట్స్‌ను చూస్తుంటే తనతోపాటు చాలా మంది బాధపడుతున్నారని అన్నారు రేవంత్. ఇదే విషయం ప్రజలకు పార్టీ కార్యర్తలకు తెలిస్తే బట్టలూడదీ రోడ్డుపైకి తీసుకొచ్చి కొడతారని హెచ్చరించారు. నీచమైన భాషతో వాళ్లు చేసే కామెంట్స్‌లో తన పేరు తీసేసి వాళ్లను ప్రోత్సహించే వాళ్ల పేర్లు పెట్టుకొని చూడలని సూచించారు. ఆ బాధ ఏంటో అప్పుడు తెలుస్తుందన్నారు. ప్రజాజీవితంలో ఉన్నాం కాబట్టి చూసీచూడనట్టు వెళ్లిపోతున్నామని ఇకపై ఉపేక్షిస్తే ఇది మరింత పెచ్చురిల్లితుందని ఆందోళన వ్యక్తం చేశారుజర్నలిస్టులపై అసెంబ్లీలో రేవంత్ చేసిన కామెంట్స్ ఆయన మాటల్లోనే...... "పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చి వాటిని రికార్డు చేసి సోషల్ మీడియా పెడితే వాళ్లపై పోలీసులు కేసులు పెడితే మీకు దుఃఖం



వస్తుంది. సోషల్ మీడియాలో పెట్టిన ఆ భాషను ఒక్కసారి చూడండి అధ్యక్ష. 2014లో కొత్తగా ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఛానల్స్‌లో ఏదో వెటకారంతో ఏదో వేస్తే ఏడాది బ్యాన్ చేశారు. చాలా మందిని జైల్లో పెట్టారు. ఇవాళ జైలుకు వెళ్లిన అమ్మాయి కూడా అప్పట్లో జైలుకు పోయి వచ్చారు. ఎవరు జర్నలిస్టులు అని నేను ఈ వేదికపై నుంచి అడగదలచుకున్నాను. ఐఅండ్‌పీఆర్ లేదా డీఐబీపీ ఆమోదించిన పత్రికలు ప్రసార సాధనాలు, వాళ్లు ఇచ్చే ఐడీ కార్డులు ఉన్న వాళ్లు జర్నలిస్టులా? ఎవడు పడితే వాడు ఏదో ట్యూబ్ పెట్టుకొని ఇష్టారాజ్యంగా అధ్యక్షా... ప్రజా జీవితంలో ఉన్నాం కాబట్టి ఓపిక పడతున్నాం అధ్యక్షా... రక్తం మరుగుతుంది. ఏందా భాష అధ్యక్షా? నిజంగా మీరు మనుషులా అని అడగదలుచుకున్నాం. మీకు భార్య బిడ్డలు లేరా? తల్లిదండ్రులు లేరా, మీ అమ్మనో చెల్లినో ఇలా అంటే వింటారా అని నేను అడుగుతున్నాను ఈ అరెస్టును ఖండించినవాడిని. నా భార్యను బిడ్డను తిడుతుంటే నాకు నొప్పి అవుతుంది కానీ ఓ ఆడపిల్లను అవమానిస్తుంటే నీకు నొప్పిలేదా? మీరుఏ సంస్కృతిలో ఉన్నారని అడుగుతున్నాను. తోలు తీస్తాను ఒక్కొక్కడ్ని ముఖ్యమంత్రిగా చెబుతున్నాను. బట్టలు విప్పి రోడ్డు మీద తిప్పిస్తా. ప్రజాజీవితంలో ఉన్న మమ్మల్ని విమర్శించండి. విశ్లేషించండి. మా గురించి మాట్లాడండి. ఇంట్లో ఉన్న ఆడబిడ్డల గురించి మాట్లాడే సంస్కృతి ఎక్కడి నుంచి వచ్చింది. తెలంగాణ సమాజం ఇదేనా. ఈ చైతన్య ప్రాంతంలో ఎదురించి నిలబడిన వాడే మొనగాడు. ఆధిపత్యంపై కొట్లాడిన గడ్డ ఇది. ఈ సంస్కృతిని సర్వనాశనం చేసి విష సంస్కృతిని నోటికి వచ్చిన మాట్లాడించి వాటిని పోస్టు చేయించి ఇదేం పైశాచిక ఆనందం. వాళ్లు తిట్టిన తిట్లకు నా పేరు తీసి మీరు పెట్టండి. మీకు అన్నం తినబుద్ధి అవుతుందేమో చూస్తాను. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే బలహీనమైపోయినట్టా అధ్యక్ష. అట్లా అనుకుంటున్నారా. ఓపిక పట్టిన. ఇంకా ఎంతమంది ఉన్నారో తెలియదు. నాకు చికాకు వచ్చిందని తెల్వదు. లక్షల మంది రోడ్లపైకి వచ్చి బట్టలిప్పదీసి కొడతారు. నేను వద్దంటున్నా కాబట్టి చట్టంపై గౌరవం ఉంది కాబట్టి ఏమనకుండా ఊరుకుంటున్నాం.

చంద్రశేఖర్‌రావు మీ పిల్లలకు చెప్పుఇది మంచిది కాదు. మానసికంగా కుంగదీసి దెబ్బ తీయొచ్చని అనుకుంటున్నారేమో. అలా కుదరుదు. హద్దుదాటితే, మాట జారితే ఫలితం ఎలా ఉంటుందో మీరు అనుభవిస్తారు. పదవి ఎంతకాలం ఉందనేది కాదు. ఎట్ల ఉన్నామో అన్నదే నేను లెక్కగడతా. ఆత్మగౌరవం చంపుకొని లాలూచి పడి రాజకీయం నేను చేయను అధ్యక్ష. ఉన్నతం కాలం నిటారుగా ఉంటా, ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోను. అవసరం అయితే చట్టాన్ని సవరించే పని చేస్తాం. ఆడపిల్లలు ఆ రకమైన భాషను వాడి సోషల్ మీడియాలో పోస్టు చేస్తే ఇది మంచిదా అధ్యక్ష. తెలంగాణ ఇలాంటి సంప్రదాయం ఉందా అధ్యక్ష. తెలంగాణ ఉద్యం పీక్‌లో ఉన్నప్పుడు కూడా ఇలాంటి భాషా ప్రయోగం జరగలేదు. వీటిని క్షమించే సమస్య లేదు. చంద్రశేఖర్ రావు వినండి మీ పిల్లలకు చెప్పండి. ఇలాంటి సంస్కృతిని భవిష్యత్ తరాలకు ఇవ్వదలుచుకోలేదు. ఇక్కడనే ఉప్పుపాతరేయదలుచుకున్నాను. ఎవర్నీ వదలను. ప్రజాస్వామ్యయుతంగా విమర్శించండి. సరిద్దికోవడానికి సిద్ధంగా ఉన్నాం. గౌరవిస్తాం. దీనిపై చర్చ జరగాలి. జర్నలిస్టు సంఘాలు కూడా ముందుకు రావాలి. జర్నలిస్టు అనే పదానికి అర్థమేంటో ఇవ్వండి.... ఆలిస్టు కూడా ఇవ్వండి. ఆ లిస్టులో ఉన్న వాళ్లు ఇలాంటి తప్పులు చేస్తే ఏం శిక్ష వేస్తారో మీరు నిర్ణయించండి. ఆ లిస్టులో లేనోళ్లు జర్నలిస్టు కాదు. వాళ్లను క్రిమినల్‌గానే చూస్తాం. ఆ క్రిమినల్స్‌ను ఎట్లా జవాలు చెప్పాలో అట్లానే చెబుతాం. ముసుగేసుకొని వస్తే ముసుగు ఊడబీకి బట్టలూడదీసి కొడతాం. తమాషా చేయొద్దు. అన్నిచట్టపరిధిలోనే చేస్తాం. చట్టాని ఎక్కడా దాటబోం. ప్రతి దానికి ఒక శిక్ష, విధానం ఉంది. విశృంఖలత్వాన్ని ఆపాలి. తెలంగాణ సమాజానికి చీడపురుగులా మారుతుంది. దాని నియంత్రణకు చట్టం చేద్దాం."

# సస్పెన్షన్ ఎత్తివేయండి..

**హైదరాబాద్ పెన్ పవర్:)**
తెలంగాణ స్పీకర్‌ను అగౌరవపరిచేలా మాట్లాడలేదని బీఆర్ఎస్ మరోసారి స్పష్టం చేసింది. శనివారం సభ ప్రారంభ సమయంలో బీఆర్ఎస్ సభ్యుడు హరీష్ మాట్లాడుతూ జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌పై పునరాలోచించాలని రిక్వెస్ట్ చేశారు. సభలో హరీష్‌రావు మాట్లాడుతూ... స్పీకర్ అంటే తమకు చాలా గౌరవం ఉందని అన్నారు. ఆయన్న ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు సహకరించామని పేర్కొన్నారు. అలాంటి స్పీకర్‌ను అగౌరవపరిచే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. జగదీష్ రెడ్డి కూడా తప్పుగా మాట్లాడాలేదని వివరణ ఇచ్చారు. అందుకే సస్పెన్షన్‌ను పునఃపరిశీలించాలని కోరారు. సస్పెండ్ చేసే ముందు జగదీష్ రెడ్డి వివరణ కూడా తీసుకొని ఉంటే బాగుండేదని అన్నారు. అంతకుముందు స్పీకర్ ఛాంబర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభాపతిని కలిశారు. ఎలాంటి వివరణ తీసుకోకుండా చర్యలు తీసుకున్నారని అన్నారు. తప్పుగా మాట్లాడలేదని సస్పెన్షన్ ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.